# గిరీశంకన్నా పొగరుబోతు

శ్రీ ఏ, ఎల్ నరసింహారావు

ఏమూలచూచినా భయానక దృశ్యాలే ఒక మూల పాములు పడగలెత్తి బుసలుకొడుతున్నాయి మరోవేపు గంగాళాలలో సలసల నూనె కాగుతున్నది ఇంకోవైపు ఎర్రగా కాల్చిన ఇనుప స్తంభాలు దారిపొడుగునా తేళ్ళు జెర్రులు, పాములు, ముళ్ళకంపలువుండి అడుగుతీసి అడుగువేయటానికి వీలులేకుండావుంది భీకరాకారుడైన యమధర్మరాజు సేవకులు ఛత్రచామరములు వీచుచుంటగా దున్నపోతును ఆరోహించి, వేదికవద్దకుచేరి సింహాసనారూఢుడైనాడు అంతా నిశ్శబ్దంగా వున్నారు

'చిత్రగుప్తా, విశేషము లేమి ?"

'మహారాజా ! విశేషములు లేకేమి ఇదివరలో మన లోకంలో ఇంతటి మహత్తర విషయాన్ని ఎరిగుండలేదు "

"ఏమది ! అంతటి విశేషమా ! సత్వరమే ఎరిగింపుము "

'చిత్తము స్వామీ ఇతను నరలోకంనుంచి వచ్చాడు," అని చిత్రగుప్తుడు నన్ను చూపించాడు నేను యమధర్మరాజువంక వెర్రిచూపులు చూస్తూ నిలబడ్డాను ఒకసారి యమధర్మరాజు నావైపు తీక్షణంగా చూశాడు ఎడంచేత్తో మీసంమెలేసుకొంటూ చూసి చిత్రగుప్తునివైపు తిరిగి 'ఆ తరువాత' అన్నా"

చిత్రగుప్తుడు తవ లెక్కలపుస్తకం ఒకసారి ఇటు అటు పేజీలు తిరగవేశాడు "మహాశయా ఇతనుచేయని పాపకార్యం అంటూ లేదు త్రాగుడు, జూదం, దొంగతనం, వ్యభిచారం కుల ద్వేషం స్వామిద్రోహం మొదలైనవన్నీ పుట్టుకతోనే అలవడ్డాయి ఎందరినో ఇదివరలో మనం చూశాము కాని ఇన్ని దురలవాట్లు వున్న వ్యక్తినిమాత్రం చూసివుండలేదు ఇతడే ప్రథముడు. అంతేకాదు ."

"ఆ ఇంకా వుందిగా ? ఏమది అని యమధర్మరాజు ఆశ్చర్యంతో ప్రశ్నించాడు

'చిత్తము స్వామీ ఇతను ఒక చోరీనేరంక్రింద రాజదండనకు పాత్రుడై • జైలునుంచి పరారయినాడు పోలీసులు వెంటబడగా ఆత్మహత్యకు గడంగాడు ఆత్మహత్య మహాపాతకమనిగదా పురాణాలు ఘోషిస్తున్నాయి," అని చిత్రగుప్తుడు వినయపూర్వకంగా యమధర్మరాజుతో అన్నాడు

"అవునవును సరే' అని యముడు ఒక నిముషం సేపు ఏదో ఆలోచించాడు తరువాత నావైపుతిరిగి "ఏం ఇదంతా నిజమేనా ? అని ప్రశ్నించాడు

"చాలవరకు నిజమే స్వామి కాని ఒక్క విషయంలోమాత్రం చిత్రగుప్తులవారు అసత్యం పలికారు నాకు వ్యభిచారదోషం ఆపాదించటం పొరపాటు" అన్నాను నేను

'ఓహో ! ఆలాగునా మిగిలిన అలవాట్లన్నీ వున్నాయన్నమాట "

కాదు స్వామీ అవైన అలవాట్లుకాదు నా పరిస్థితులు నన్ను అలా చేశాయి

"చాలవరకువుండే వ్యరహారం అన్నీవుంటే వ్యభిచారమాత్రం లేదని ఎలా అనుకొంటాను వీటన్నిటికీ మిటి కారణం ? నీవు చెప్పుకోవలసింది ఎదైనా వున్నదా ?"

చిత్తము స్వామీ," అని నా చరిత్ర ప్రారంభించాను, యమధర్మరాజు సావధానుడై వింటున్నాడు చిత్రగుప్తుడు షార్ట్‌హాండ్ తీసుకొంటున్నాడు పాములు పడగలెత్తి ఆడుతున్నాయి తేళ్ళ,జెర్రులు చెవులు నిక్కపొడుచుకొని వింటున్నాయి

"నేనొక సామాన్యకుటుంబానికి చెందినవాడను నా

చిన్నతనంలోనే నా తల్లి మరణించింది. నా తండ్రి మరొకరిని వివాహమాడారు. నాకు ఆ సవతి తల్లికి పడలేదు. పాపం నా తండ్రి ఒకవైపు పుత్రవాత్సల్యంను మరోవేపు భార్యపట్ల గల ప్రేమపాశాను బాధపడ్డారు. ఎట్టకేలకు నా దారి నేను చూసుకోవలసివచ్చింది. పొట్ట చేతపట్టుకొని నేను తిరగడం మొదలెట్టాను. కొంత కాలానికి ఒక షావుకారువద్ద గుమాస్తాగాచేరాను. అతని వద్ద అహోరాత్రాలు పనిచేశాను. ఉదయం ఏడు మొదలు రాత్రి పన్నెండువరకు అతని కొలువులోనే వుండేవాడిని. అయినా నాకు సరిగా జీవనం గడవలేదు. కాని నేనతని కొలువు మానలేదు. ఆ షావుకారు బ్లాక్ మార్కెటు చేయడంలో ప్రసిద్ధుడు. బీదలు చెమటోడ్చి కష్టించి తెచ్చుకొన్నదానిని ఇతను నిర్దాక్షిణ్యంగా గుంజుకొనేవాడు. ఎల్లికి బిచ్చంపెట్టేవాడుకాదు. అధికారవర్గమంతా అతని చెప్పుచేతులలో వుండేవారు. బ్లాక్ మార్కెటును అరికట్టడానికి నియోగించబడ్డ అధికారులంతా అతని ఆప్తులు. ఇలాంటి అవినీతిని నేను చూస్తూ సహించలేక షావుకారును మందలించాను. నాకు ఉద్యోగంనుంచి బర్తరఫు అయింది. తిరిగి ఎక్కడా ఉద్యోగం లభించలేదు.

నాకు జీవితంమీద విరక్తి అసంతృప్తి పుట్టింది. ఈ బాధవల్ల నాకు మనస్థిమితంలేకపోయింది. ఇలాంటి పరిస్థితులలో నాకు మద్యం అలవాటైంది.

చిత్రగుప్తుడు ఒకసారి తను చెప్పిందంతా నిజమేనన్నట్లు గర్వంతో యముడివైపు చూశాడు. యముడు బుర్ర ఊగించాడు.

నేను మళ్ళీ ప్రారంభించాను. "నిజంగా ఆ మద్యం వల్ల నేను కొంత సుఖపడ్డాను. మనస్సుకు ఎంతో ఉత్సాహం, ఆనందం కలిగేది. అది సేవించినప్పుడు నా కష్టాలను మరిచి నా అంత సుఖజీవి లేడన్నట్లు నిద్రించేవాడిని. స్వామీ మద్యపానం దోషమంటారుగదా. శ్వేతజాతులవారంతా నిషావస్తువులను సేవిస్తారే. వారెవరూ ఈ లోకంలో కన్పించరేమి మహారాజా" అని ఒకసారి యముడివేపు, మరోసారి చిత్రగుప్తుడివేపు చూశాను. చిత్రగుప్తుడు తన లెక్కలలో నిమగ్నుడైవున్నాడు. యముడు ఉగ్రుడై "నీ ఏడుపేదో ఏడవవోయ్" అన్నాడు.

"స్వామీ కల్లు సారాయిలను నిషేధించి ప్రయోజనమేమి? బ్రాంది విస్కీల సంగతో" అంటుండగానే యముడు "అదుగో మళ్ళీ" అని గద్దించాడు. చిత్రగుప్తుడు బుర్రపైకెత్తి "వీడు గిరీశంకన్నా వాగరుబోతు మహారాజా" అన్నాడు.

నేను నా కథ మళ్ళీ మొదలెట్టాను. "ఇలా వుండగా కొంతకాలానికి నావద్ద ఒక పైసాకూడా లేకుండా అయిపోయింది. తిండికిలేదు త్రాగుడుకు లేదు. నాకేమీ పాలుపోలేదు. భిక్షాటనకై బయలుదేరాను. మొద్దులావున్నావు పనిచేసుకోరాదా అనేవారే తప్ప పనిచూపించినవారేలేరు. నాకు విసుగెత్తింది. నేను గుమస్తాపనిచేసిన షావుకారింటికి కన్నంవేయాలనిపించింది. బీదల డబ్బును అన్యాయంగా దోచుకొంటున్న షావుకారి డబ్బును అపహరించటం న్యాయమనిపించింది. అతనింటికి కన్నంవేశాను. పట్టుబడ్డాను. నాకు ఆరు సంవత్సరాలు శిక్ష విధించారు. ఇలా జరుగుతుందని నాకు తెలుసు. కాని తప్పనిసరి అయింది. స్వామీ తమకు ఆగ్రహం రాదంటే ఒక విషయం మనవిచేస్తాను. నాకు శిక్ష విధించిన న్యాయాధికారి త్రాగుబోతు. కాని విస్కీ బ్రాందీలు మాత్రమే సేవిస్తారు. అందువల్ల వారు త్రాగుబోతనిపించుకోరు. ఆయన త్రాగి భార్యను కొడుతుంటాడు. త్రాగి న్యాయస్థానంలోనే విచారణచేస్తుంటారు."

"అదుగో, అనవసర ప్రసంగం" అని యముడు బల్లగుద్దాడు.

"స్వామీ ఆ న్యాయాధికారి ఇక్కడికివచ్చినట్లులేదు" అన్నాను. చిత్రగుప్తుడు "లేదు అతను స్వర్గలోకంలో వున్నాడు."

"మహారాజా, ఆ షావుకారో" అని నలుదిక్కులా కలయజూశాను. యముడు చిత్రగుప్తునివేపు చూశాడు. చిత్రగుప్తుడు తన చిఠాచూసి "అతనుకూడా స్వర్గంలోనే వున్నాడు. ఆ షావుకారు తన అవసానదశలో బీదలకు అన్నదానంచేశాడు. ఆ న్యాయాధికారి మరణసమయంలో "శివ శివ" అని ముమ్మారు ఉచ్చరించాడు. అందువల్ల వారికి స్వర్గంలో స్థానం లభించింది" అన్నాడు.

"నీ సంగతేదో తొందరగా ముగించు" అన్నాడు యముడు.

"స్వామీ, తరువాత నన్ను జైల్లోవేశారు. ఆ జైల్లో

ఈ నరకంలోకన్నా ఎక్కువ కష్టాలు అనుభవించాను మానవ ప్రవర్తనను మార్చి వారికి మనోవికాసం కలిగించటానికి బదులు జైళ్ళు మానవునిలో పశుత్వాన్ని కల్పించడానికి తోడ్పడుతున్నాయి

ఓహో! జైళ్ళు పెండ్లిల్లు వున్నట్లు వుండాలేం అన్నాడు చిత్రగుప్తుడు కళ్ళెగరేస్తూ

అసలు జైళ్ళే అవసరంలేకుండా చేయకూడదా స్వామీ అన్నాను ఎలా చేస్తావోయ్ అన్నాడు చిత్రగుప్తుడు

నేరాలు చేయవలసిన అవసరంలేని సాంఘిక పరిస్థితులను కల్పించకూడదా? అన్నాను

నోరుముయ్! తొందరగా ముగించు అన్నాడు యముడు

నా కెందుకొచ్చిన గొడవ అన్నట్లు చిత్రగుప్తుడు బెల్లంకొట్టిన రాయిలా కూర్చున్నాడు

"స్వామీ, ఆ జైలు బాధ పడలేక ఒక అర్ధరాత్రివేళ జైలునుంచి పరారయిపోను నన్ను పోలీసులు వెంటాడారు విధిలేక ఆత్మహత్య చేసుకొన్నాను చచ్చినా నరకం తప్పలేదు అని ముగించాను

ఒక నిముషం యముడు ఆలోచించాడు చిత్రగుప్తుడు గుడ్లొదిలేసి చూస్తున్నాడు యముడు భటుల వంక చిత్రగుప్తునివంక చూసి ఆత్మహత్య మహాపాతకం ఇతను చేసిన పాపకార్యాలకు అంతులేదు ఇతన్ని సలసలకాగే నూనెకాగులో వేయండి అన్నాడు

మహారాజా! చేసిన పాపం చెపితే పోతుందంటారు గదా నాకు ఆరు సంవత్సరాల శిక్ష విధించిన న్యాయమూర్తి తీర్పుకన్నా తమ తీర్పు ఎలా మెరుగు స్వామీ అన్నాను వణుకుతూ ఆ ధిక్కారమా అని గద్దించాడు యముడు వేమూరి గగ్గయ్యలాగ

'అబ్బబ్బ! ఏమిటండి ఆ మొద్దునిద్దర, పందికొక్కు బియ్యం తింటూంటే అని మా ఆవిడ అటు ఇటు దొర్లించింది ఉలిక్కిపడి లేచేసరికి పందికొక్కు వచ్చిన దారినే పోయింది నాకు దాన్ని చూసేసరికి యమధర్మరాజు దున్నపోతు జ్ఞాపకంవచ్చింది





అమృతాంజనం యొక్క స్వర్ణోత్సవ సంపుటి

త్వరలో వెలువడనున్నది

దయచేసి మీ సందేశాలను పంపవలసిందని

మా ప్రార్థన

అమృతాంజన్, లిమిటెడ్, మద్రాసు.


మదరాసు, 33 జోన్సుస్ట్రీట్ వినోదిని ప్రెస్‌లో పి ఎస్ వేణుగోపాలస్వామి నాయుడుగారిచే ముద్రించి ప్రకటింపబడినది సంపాదకురాలు ఆర్ రంగనాయకమ్మ